


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 17 పుష్యం : 46-48 20-05-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16
VOL : 7 ISSUE : 17
EDITOR
**P.S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

20-05-2002

## సాధనలో ముఖ్యమైన అంశం

జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఏకవస్తువు బహ్మమే అయివున్నారు. అఖండముగా, తానుగా నుండుటయే మోక్షము. 'ఆత్మ'కన్న భిన్నముగా ఒక్క అణువునూ లేదు. 'ఆత్మ'కన్న భిన్నముగా ఏదైనా ఉన్నదని తలచుట వట్టిభ్రమ. అదియే మిధ్యాదృష్టి, అజ్ఞానము. అజ్ఞానమే జనన, మరణ పరంపరలకు కారణమగుచున్నది. దీపము వెలుతురులో పదార్ధములు గోచరించునట్లు, 'ఆత్మ' వెలుతురులో సూర్యుడువరకు గల ఈ సర్వప్రపంచమూ గోచరమగుచున్నది. మన నిజస్వరూపము నెరుగుటలో శ్రమలేదు, ప్రతిబంధక విషయములను, విషయ వాంఛలను విడిచిపెట్టుటయే కష్టము. సాధనలో శ్రమ అంతయూ మన మనస్సునూ, బుద్ధిని సంస్కరించుకొనుట యందునూ, ఇంద్రియములను నిగ్రహించుటయందును మాత్రమే కలదు. మనస్సు అత్యంత పవిత్రమగుటకే దీర్ఘకాల కృషి యొనర్చవలసియున్నది. ప్రతి ఇంద్రియానికి ఒక విషయం వుంటుంది. ఆవిషయం మీద ఆ ఇంద్రియానికి ఆకర్షణ వుంటుంది. ఆ ఆకర్షణ నుండి ఆ ఇంద్రియాన్ని తప్పించటం సాధనలో ముఖ్యమైన అంశం. తలంపు, మాట, చేతలో పవిత్రత ఉన్నవారికి తత్త్వము నెరుగుటలో శ్రమ ఉండదు. నిర్మలమైన అద్దమునందు మన ముఖ ప్రతిబింబము స్పష్టముగా కనబడురీతిని పవిత్రము, నిర్మలము, ఏకాగ్రము అయిన మనస్సుకు జ్ఞానము సంప్రాప్తిస్తుంది. అన్నము వండుటకు ఒక గంట వ్యవధి పట్టిన, దానిని భుజించుటకు పది నిముషములు సరిపోవు రీతిని, సాధనలో శ్రమ అంతయు మనస్సును సిద్ధము చేయుటయందే గలదు. జ్ఞాన ఫలమైన మోక్షమును అభిలషించువారే మానవులలో శ్రేష్ఠులు.

**చావలి సూర్యనారాయణ మూర్తి**
టీచర్, అమలాపురం

ఈ సంచికలో...... **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

| | | |
|---|---|---|
| 28-03-2002 | చించినాడ | 3 |
| 17-04-2002 | సఖినేటిపల్లి | 8 |
| 27-04-2002 | పాలకోడేరు | 13 |

Visit us @ www.srinannagaru.com

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-03-2002, చించినాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణభక్తులు కృష్ణుడిని దేవత అంటే అంగీకరించరు. కృష్ణుడు అంటే అంతర్యామి, అందరి హృదయాలలో ఏ వస్తువు అయితే అంతర్యామిగా ఉందో అదే కృష్ణుడు అని కృష్ణ భక్తులు చెపుతారు. మీరు ఎవరైతే దేవతలు అంటున్నారో వారు అందరూ అంతర్యామి అయిన కృష్ణుడులోనుండి వచ్చినవారే అంటారు. ఈ కలియుగంలో ఏ నామం జపించటం వలన మనస్సులో ఉన్న దోషాలు పోతాయి అని బ్రహ్మదేవుడిని అడిగితే హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అని చెప్పాడు. ఇంకో ఉపాయం చెప్పమంటే నీవు ఎన్నిసార్లు అడిగినా ఇదే చెపుతాను అని చెప్పాడు. మనం నామం చేసేటప్పుడు యాంత్రికంగా చేయకూడదు. ఇష్టంతో, ప్రేమతో మనస్సును అక్కడ పెట్టి నామం చేయాలి. ఆనామం వేరు, భగవంతుడు వేరుకాదు నామం భగవంతునితో సమానము. కొంతమంది అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని ధ్యానించి తరిస్తారు. గుడిలో ఉన్నవాడు హృదయంలో ఉండటం కాదు, హృదయంలో ఉన్న స్వామే గుడిలో మూర్తి రూపంలో ఉన్నాడు. అంతర్యామిగా ఉన్నవాడిని ధ్యానం చేయలేక గుడిలో మూర్తి రూపంలో ఉన్నవాడిని ధ్యానం చేస్తారు. మన హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడు మాత్రమే నిజమైన దేవుడు. హృదయంలో ఉన్న దేవుడిని మీరు కృష్ణుడు అనండి, రాముడు అనండి, యెహోవా అనండి కాని ఉన్నవాడు మాత్రం ఒక్కడే. ప్రపంచంలో ఉన్న ఏ అనుబంధం నిలబడదు. అందువలన మీరు అనుబంధం పెట్టుకొంటే హృదయంలో అంతర్యామిగా ఉన్న ప్రభువుతో అనుబంధం పెట్టుకోండి. ప్రపంచంలో నీకు ఎన్ని స్నేహాలు ఉన్నా, బంధుత్వాలు ఉన్నా అవి కాలప్రవాహంలో తెగిపోతాయి. కాలానికి అతీతుడు, ప్రాంతానికి అతీతుడు, అవస్థలకు అతీతుడు, మతాలకు కులాలకు అతీతుడు, జనన మరణములు లేనివాడు, అనుగ్రహస్వరూపుడు, నీవు ధ్యానం చేయటానికి తగినవాడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడిని స్మరించి, ధ్యానించి తరించండి.

లోకంలో దుమ్ము ఉంది, కృష్ణుడిలో శాంతి ఉంది అని కృష్ణ భక్తులు చెపుతారు. ఎన్ని జన్మలు ఎత్తి మీరు లోకాన్ని పరిశీలన చేసినా మీకు మిగిలేది దుమ్ము. కృష్ణుడిని వదిలేసి మాకు ఇంకా మంచి జన్మలు రావాలి అంటారు. ఎందుకు ఆ జన్మలు? మీకు జన్మల గొడవవద్దు. ఇప్పుడు ఈ శరీరం ఎలా వచ్చిందో మరల అలాగే కొత్త శరీరం వస్తుంది. ఈ





శరీరం ఎలా పోతుందో ఆ శరీరం కూడా అలాగే పోతుంది. అందువలన ఈ జన్మల గొడవ, లోకంలో ఉన్న దుమ్ము గొడవ వదిలేసి నారాయణుడిని స్మరించండి, తరించండి, చావులేని స్థితి పొందండి. ఊడిపోయే వస్తువులను పట్టుకోవద్దు. ఏదైనా అనుబంధం పెట్టుకొంటే లోపల ఉన్న నారాయణుడితో అనుబంధం పెట్టుకోండి, మిగిలిన అనుబంధాలు అన్నీ కాల ప్రవాహములో కొట్టుకొనిపోతాయి. అవి నిలబడవు సరికదా పరిణామంలో నీకు దుఃఖమును తీసుకొని వస్తాయి అని కృష్ణభక్తులు చెపుతారు. అందువలన మీరు ధ్యానం చేస్తే మీరు స్మరిస్తే అంతర్యామిగా ఉన్న కృష్ణుడిని ఆరాధించండి, కృష్ణుడిని ఉపాసనచేయండి అని చెపుతారు. శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు శాంతి అవసరం. శారీరక ఆరోగ్యం కాపాడుకోవాలంటే తినే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, మనస్సుకు శాంతి కావాలంటే శుద్ధభక్తులతో సహవాసం చేయాలి. మనం కూడా భక్తులమేగాని సాధారణ భక్తులము. ఒకరోజు ఉండి రెండోరోజుకు పోయేశాంతి కాదు నీకు కావలసింది. శాశ్వతమైన సుఖం, శాశ్వతమైన ఆనందం, శాశ్వతమైన సహనం నీకు కావాలంటే శరీరం ఉన్నా శరీరం లేకపోయినా నీవు ఆనందప్రవాహములో ఈదులాడాలంటే నీ హృదయంలో ఉన్న వస్తువును చేరుకోవలసిందే. ప్రభువు నీలోపలే అంతర్యామిగా ఉన్నాడు. నీ మనస్సుకు కుదురు లేదు, శాంతి లేదు, ఏకాగ్రత లేదు అందువలన ఆయన గోచరించటం లేదు. అంతర్యామిగా ఉన్న కృష్ణుడు దర్శనం మీకు కావాలంటే మీరు లోచూపు నేర్చుకోండి. మనస్సుకు శాంతి ఉంటే, చల్లదనం ఉంటే, సహనం ఉంటే దానికి లోచూపు కలుగుతుంది. లోపల అంతర్యామిగా ఉన్న వస్తువును వెతకండి అంటే మనస్సు వెతకాలి. కుదురులేని మనస్సు, శాంతి లేని మనస్సు ఏమి వెతుకుతుంది? మానసిక ఆరోగ్యమును ఎవడైతే కాపాడుకొంటున్నాడో వాడు లోపల వెతుకుతాడు. అందువలన మనస్సును మిత్రుడుగా చేసుకోండి అని చెపుతారు. మిత్రుడిగా ఉన్న మనస్సుకు, స్వాధీనం అయిన మనస్సుకు లోచూపు కలుగుతుంది. లోచూపు కలిగినప్పడు అది లోపల వెతుకుతుంది అప్పడు లోపలఉన్న వస్తువు వ్యక్తమవుతుంది.

కృష్ణభక్తులు ఏమి చెపుతారు అంటే శుద్ధభక్తులతో సహవాసం వలన అన్నీ వచ్చేస్తాయి అని చెపుతారు. మీరు రజోగుణం నుండి విడిపోతారు, బుద్ధిలో ఉన్న కల్మషం అంతా పోతుంది, అంతర్యామిగా ఉన్న ప్రభువును చేరుకొంటారు అని చెపుతారు. ఒక రూపాయి నీ దగ్గర ఉంది అనుకో. నా దగ్గర పావలాలేదు అని నీవు చెప్పలేవు, 50 పైసలు లేవు అని చెప్పలేవు, ఎందుచేతనంటే ఆ రూపాయిలో పావలా, 50 పైసలు ఇవి అన్నీ ఇమిడి ఉన్నాయి. అలాగే

శుద్ధభక్తులతో సహవాసం వలన ప్రాణాయామం చేయటం వలన వచ్చే ఫలితం, ధ్యానం చేయటం వలన వచ్చే ఫలితం, జపం చేయటం వలన వచ్చే ఫలితం ఇలా అన్నీ వచ్చేస్తాయి అంటారు. శరీరము, మనస్సు, ఇంద్రియాలు వీటిని రజోగుణం తొలగించుకోవటానికి జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. నీ మాట కూల్‌గా ఉండాలి. ఇతరుల తెలివితేటలు పెంచటానికి, వారికి లోచూపు కలగటానికి నీ మాట సహకరించాలి. ఆలోచనలో ఉద్రేకం పనికిరాదు. భగవంతుని పాదాలను ఆశ్రయించు. మీ స్నేహితులు మిమ్మల్ని మోసం చేయవచ్చు, మీ బంధువులు మిమ్మల్ని మోసం చేయవచ్చు, మీ పొరుగువారు మిమ్మల్ని మోసం చేయవచ్చు కాని అంతర్యామిగా ఉన్న ప్రభువు మిమ్మల్ని మోసం చేయడు. ఎవడైతే మిమ్మల్ని మోసం చేయడో వాడి పాదాలను మీరు ఎందుకు ఆశ్రయించటం లేదు అని కృష్ణ భక్తులు అడుగుతున్నారు. విమర్శల వలన రజోగుణం, కల్మషం పెరిగిపోతుంది. నీవు రజోగుణం నుండి విడుదల పొందు, కల్మషంలోనుండి బయటకు రా. శాంత మనస్సును సాధించుకో. అప్పుడు నీవు బ్రహ్మంలో ఐక్యమవుతావు. రజోగుణంలో నుండి విడుదల పొందాలంటే నీవు ఎవరినీ భయపెట్టవద్దు, ఇతరులు నిన్ను భయపెట్టటానికి ప్రయత్నం చేసినా నీవు భయపడవద్దు. స్నానం చేసి, స్నానం చేసి శరీరాన్ని ఎలా శుద్ధి చేసుకొంటున్నావో అలాగ కృష్ణ స్వామిని స్మరించి, స్మరించి నీ మనస్సుకు స్నానం చేయించు. అప్పుడు మనస్సులో ఉన్న కల్మషం అంతాపోతుంది, అప్పుడు ఉత్తమ సుఖం నీకు అందుతుంది. ఎవడైతే పునర్జన్మనుండి విడుదల పొందాలి అనుకొంటున్నాడో వాడు నా పాదాలను ఆశ్రయించి రాగద్వేషముల నుండి విడుదల పొందాలి అని భగవంతుడు చెపుతున్నాడు. పని విడిచిపెట్టి పారిపోవద్దు. నన్ను స్మరిస్తూ పనిచేసుకోండి. అలా చేస్తే మీరు రాగద్వేషములనుండి విడుదల పొందుతారు. ఎవడైతే రాగద్వేషములనుండి విడుదల పొందాడో వాడికి పునర్జన్మ హేతువులు నశిస్తాయి.

మీరు మంచిగా ఉండాలి, వివేకంగా ఉండాలి అనుకొంటారు. మీ మంచిని, మీ వివేకాన్ని ఎవరో ఒకరు పోగొడుతూ ఉంటారు. అప్పుడు కూడా మీరు మంచి తనాన్ని, వివేకాన్ని కాపాడుకోవాలి. వారు చెడగొడుతున్నారు అందుచేత పోయింది అంటే మీరు సాధన చేయటంలేదు అని అర్థం. ఆత్మసముపార్జన చేసేవాడికి ఓర్పు, సహనం, ఏకాగ్రత అన్ని సద్గుణాలు ఉండాలి అని చెపుతారు మీ అభిప్రాయం ఏమిటి అని భగవాన్‌ను అడుగుతున్నారు. మీరు జ్ఞానం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటే సద్గుణాలను ప్రత్యేకంగా సంపాదించనక్కరలేదు, వాటంతట అవే వస్తాయి. సత్యాన్వేషణలోనే సద్గుణ రాశి అంతా సహజంగా వచ్చేస్తుంది. మన ఆలోచనలోగాని, మాటలోగాని, పనిలోగాని రాగద్వేషముల ప్రభావం ఉండకూడదు.

20-05-2002



అప్పుడు నీవు రజోగుణం నుండి విడుదల పొందుతావు. మనం ధ్యానం చేయటానికి కూర్చొంటాము. ఏదో విషయాలు గుర్తుకు వస్తాయి, జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వస్తాయి, చేతిలో ఉన్న కాలాన్ని వదిలేస్తాము, అదే మాయ. నీకు విషయాల పట్ల ఎంత ఆసక్తి ఉందో దానికి రెట్టింపు ప్రేమ నీకు ఈశ్వరుని మీద ఉంటేకదా మనస్సు విషయములనుండి భగవంతుని వైపుకు తిరిగేది. నీకు మనోబలం కావాలి. ఈశ్వర స్మరణ వలన మనస్సు శుద్ధి అవుతుంది, అప్పుడు దాని మూలంలోనికి వెళ్ళటానికి తగినబలం మనస్సుకు చేకూరుతుంది. నీ శాంతికి, అశాంతికి మనస్సే కారణం. నీ మనస్సును ఎటు పంపాలో నిర్ణయించుకో. మనస్సు విషయాలను చింతిస్తూ ఉంటే ఆరోజు కారోజు, ఆజన్మకు ఆజన్మ కలుషితమవుతుంది. ఆవిషయాలు మా ప్రభువుకంటే గొప్పవా అంటున్నారు కృష్ణభక్తులు. మా ప్రభువును తెలుసుకోవటానికి అడ్డువచ్చే విషయాలు మా ప్రభువును స్మరించటంవలన వాటి అంతట అవే తొలగిపోతాయి. ఏ విషయాలను విడిచిపెట్టాలో వాటిని స్మరించవలసిన పని మాకు లేదు. ఎవరిని పొందాలో వారిని స్మరించుకొంటాము, మా ప్రభువును స్మరించుకొంటాము అంటున్నారు. శ్రీకృష్ణ చింతన పులివంటిది, విషయాలు మేకలు వంటివి. పులి దగ్గరకు మేకలు ఎలారావో అలాగ కృష్ణస్మరణలో ఉన్నవాడి దగ్గరకు విషయాలు రానేరావు అంటారు.

మనకు భక్తి ఉంది అది అనుకూల పరిస్థితులు ఉన్నంతవరకు ఉంటుంది. మనకు ప్రతికూల పరిస్థితులు వస్తే మనకు ఉన్న భక్తి ఊడిపోతుంది. ఎవరైనా చిన్నపిల్లలు సాధన చేసుకొంటున్నారు అనుకోండి. ఇప్పటి నుండి ఎందుకు? పెద్ద వయస్సు రావాలి కదా అంటారు. సాధన చేసేవారు అది నిజం అనుకొంటే అక్కడితో సాధన ఆగిపోతుంది. సత్యాన్వేషణలో ఉన్నప్పుడు మీకు అనేక ఆటంకాలు వస్తాయి, జీవితంలో ఎన్నో సమస్యలు వస్తూ ఉంటాయి. వాటిని అన్నింటిని తట్టుకొంటేనే నీవు గమ్యానికి చేరగలవు. నీ అశాంతికి ఎవరో కారణం అనుకోవద్దు, నీ మనస్సులో ఉన్న చాపల్యమే నీ అశాంతికి కారణం. గాఢనిద్రలో మనం అహంభావరహితస్థితిలో ఉన్నాము. అక్కడ దేహం గొడవ, లోకం గొడవ, దేవుడు గొడవ ఏదీ మనకు లేదు. ఆస్థితిని జాగ్రదవస్థలో తెచ్చుకోగలిగితే అదే ఆత్మజ్ఞానం. ఆస్థితిని జాగ్రదవస్థలో ప్రాక్టీసు చేయటమే సాధన. అహంభావరహితస్థితి వచ్చేవరకే సాధన తరువాత సాధనతో పనిలేదు. తూర్పున సూర్యుడు ఉదయించటం ఎంత సహజమో జీవితంలో కష్ట సుఖాలు, మంచి చెడ్డలు రావటం అంతే సహజం. వస్తే రానియ్యి. వాటిని పట్టించుకోవద్దు. ఇవి అన్నీ కాలప్రవాహములో కొట్టుకొనిపోతాయి. అనుకూల పరిస్థితులు వచ్చినప్పుడు పొంగిపోయి,

**రమణ భాస్కర**

ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పుడు కృంగిపోతూ ఉంటే మీరు గమ్యానికి చేరలేరు, నన్ను పొందలేరు. ఇవి అన్నీ సహజంగా వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటిని పట్టించుకోవద్దు. మీరు ఎవరి మీద అయినా ద్వేషం పెట్టుకొంటే వారే జ్ఞాపకం వస్తారు గాని నేను జ్ఞాపకం రాను అందువలన నాకోసం ఆ ద్వేషం వదిలి వేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. నేను కాలరూపంలో ఉన్నాను. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. అక్కరలేని గొడవలలోనికి వెళ్ళవద్దు. అక్కరలేని చదువులు మీకు వద్దు. రాగద్వేషములు పెట్టుకొంటే మీ ప్రయాణం ఆగిపోతుంది. నాకోసం అయినా వాటిని వదులుకోండి అని భగవంతుడు చెపుతున్నాడు.

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-04-2002, సఖినేటిపల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సర్వేశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు. ఎక్కడో ఉంది, ఎక్కడో ఉంది అని మీరు వెతికే వస్తువు మీ హృదయంలోనే ఉంది. మిమ్మల్ని మీరు విడిచిపెట్టేసుకొని ఎక్కడో వెతుకుచున్నారు. మీ హృదయంలో ఉన్న ప్రభువు మీకు అనుభవంలోనికి రావటానికి మీరు అహంభావరహితస్థితిని పొందవలసిందే, ఇంకో అవకాశం లేదు. అందుచేత అహంభావ రహితస్థితిని పొందటంకోసం మీ మనస్సును, శరీరాన్ని, వాక్కును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఈ లోకానికి, మీకు అందరికి ఆధారంగా ఉన్న నన్ను పూజించండి, నన్ను స్మరించండి, నాయందు భక్తి కలిగిఉండండి అని పరమాత్మ చెపుతున్నాడు. వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే అహంభావరహితస్థితిని పొందటం. నీ సంకల్పము నుండి వచ్చే కర్మలను, రాగద్వేషముల వలన వచ్చే కర్మలను విడిచిపెట్టి నాకు శరణాగతి చెందు. శరణాగతిచేయటం వలన నీ మనస్సు అణుగుతుంది, నీ బుద్ధిలో ఏమైనా దోషాలు, పాపాలు ఉంటే వాటి నుండి విడిపించి నిన్ను దోషరహితుడను, పాపరహితుడను చేసి నీకు శాశ్వతశాంతిని ప్రసాదిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏ పనిచేసిన ప్రదర్శన కోసం చేయకూడదు. దేహభావన పెరిగే పనులు చేయకూడదు. అహంభావనకు చాలా పొరలు ఉంటాయి. దానికి ఉన్న మొదటిపొర దేహమునేను అనే తలంపు. దీనిలో నుండే ఇతర తలంపులు వస్తున్నాయి. నూటికి తొంబై పేచీలకు కారణాలు ఉండవు. కారణంలేని పేచీలు అన్నింటికి, సమాజంలోను ఇంట్లోను వచ్చే పేచీలకు, మీ మనస్సులో వచ్చే ఘర్షణలకు అన్నింటికి అహంభావనే కారణం. ఈ విషయం మనం మర్చిపోతున్నాము. మనకు జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వస్తూ ఉంటే అహంభావన పెరిగిపోతుంది. ధ్యానం చేయటం వలన మనకు అక్కరలేని తలంపులు రావు, జరిగిపోయిన సంఘటనలు జ్ఞాపకం రావు. పొగడ్తలకు పొంగిపోయి, విమర్శలకు కృంగిపోతూ ఉంటే దేనినైతే పోగొట్టుకోవాలని భగవంతుడు చెప్పాడో ఆ అహంభావన పెరిగిపోతుంది, ఇది మనకు తెలియటంలేదు. అహంభావన ఉన్నంత వరకు వీరు నా వారు, వారు పరాయి వారు అనే స్వపరభేధం ఉంటుంది. అక్కడ నుండి అశాంతి ప్రారంభం. అహంభావన ఉన్నంతకాలం పరిమితబుద్ధిలో నుండి విడుదల పొందనివ్వదు. స్వార్థమే పరమార్థంగా జీవించే వాడికి పరమాత్మ అనుభవంలోనికి రాడు, వారికి శాంతి గురించి, ప్రేమ గురించి తెలియనే తెలియదు. స్వార్థం కొంచం, కొంచంగా తగ్గించుకొంటూ రావాలి.

నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా అహంభావరహితస్థితిని పొందాలి, అదే నీ లక్ష్యం. దేహమునేను అనే మొదటి పొరను పట్టుకొని దాని మూలంలోనికి పంపితే ఇతర తలంపులు అనే పొరలు రావు. ఆ మొదటి పొరను వదిలేసావా దానిని బట్టి ఒకో పొర, ఒకో పొర మిగతా పొరలు అన్నీ వచ్చేస్తాయి. మనం ఏదైనా చిన్న పొరపాటు చేసాము అనుకోండి, I am sorry అంటే పోతుంది అలా కాకుండా ఆ పొరపాటును కప్పిపుచ్చుకోవటానికి మరో పొరపాటు, మరో పొరపాటు చేస్తూ ఉంటే స్మశానంకు వెళ్ళేవరకు ఇలా పొరపాట్లు చేస్తూనే ఉంటావు, నీ కాలం, శక్తి వృధా అవుతుంది. మనకు చదువు విలువ తెలుస్తోంది దానికోసం ఖర్చు పెడుతున్నాము. గౌరవం విలువ తెలుస్తోంది. దానికోసం ఖర్చు పెడుతున్నాము. కాని ఆత్మజ్ఞానం విలువ తెలియటం లేదు అందువలన దానికోసం ఎవరూ పైసా ఖర్చుపెట్టటానికి కూడా ఇష్టపడటంలేదు. అవసరంలేని విషయాలకు మనం కాలం, ధనాన్ని ఖర్చు పెడుతున్నాము కాని అవసరమైన ఆత్మజ్ఞానం కోసం ఏమీ ఖర్చు చేయటంలేదు. అహంభావరహితస్థితిని పొందాలంటే సాధకుడికి శ్రద్ధ, సహనం, పట్టుదల అవసరం. మీకు శ్రద్ధ లేకపోతే, సహనం లేకపోతే మీరు ప్రయాణించేమార్గంలో చివరిస్థితిని చేరుకోలేరు. చిన్న అగ్గిపుల్ల పెద్ద గడ్డిమేటును దహించినట్లు నీకు ఆత్మజ్ఞానం కలిగితే ఈ సృష్టి అంతాకూడా జ్ఞానంలో కరిగిపోతుంది, ఈ ఖగోళం అంతా కూడా మీ హృదయంలో లయమవుతుంది. మిథ్యానేను ఉంటే అంతా ఉంది. ఆ మొదటి పొర ఉంటే లోకం ఉంది, దేవుడు ఉన్నాడు, అన్నీ ఉన్నాయి.

ఆ మొదటి పొరను తప్పిస్తే లోకంలేదు, దేవుడు లేడు, ఏదీ లేదు. అంతానీలో ఐక్యమవుతుంది, అప్పడు నారాయణుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. తిరుపతిలో దేవుడు ఉన్నాడు, కాశీలో దేవుడు ఉన్నాడు, రామేశ్వరంలో దేవుడు ఉన్నాడు అని అన్ని పుణ్యక్షేత్రాలు తిరిగి వస్తాము, మంచిదే, కాని నీలో కూడా దేవుడు ఉన్నాడు. వాడు నాకు ఎలా తెలియబడతాడు అనే విచారణ ఎవడూ చేయటం లేదు, ఇదే మాయ. మీ హృదయంలో ఉన్న సద్వస్తువును చేరుకొనేవరకు ఏ క్షణానికి ఆ క్షణం మీ మనస్సును చెక్ అఫ్ చేసుకొంటూ ఉండవలసిందే. మీరు ఏకాంతంగా కూర్చొని మీ మనస్సు యొక్క కదలికను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. దేహము నేను అనే మొదటి పొర ఉన్నంతకాలం మిగతా పొరలు రాకుండా ఎవరూ ఆపు

**ఆనందం అనుభవించడానికి వ్యక్తిత్వం అవసరమనీ, కనుక అహంవృత్తి కోల్పోరాదనీ విశిష్టాద్వైతు లంటారు. కాని, తాను శరీరం కాదని శరీరాన్ని త్రోసిపుచ్చిన తర్వాత, తిరిగి తాను వేరొకరికి (పరమాత్మకు) శరీరం కావడం దేనికి? ఒక శరీరం అనాత్మ అయితే ఇతర శరీరాలు కూడా అనాత్మలే. ప్రపత్తితో పరమాత్మకు నిన్ను నీవు అర్పించుకొన్నప్పుడు నీవిక ఆయనవాడవే గాని నీవాడవు కాదు. ఆయనకు శరీరం కావలసివస్తే అది ఆయనకు సంబంధించిన విషయం. ఆయన శరీరం కలిగినా అశరీరి అని నీవు చెప్పనక్కరలేదు.**

- భగవాన్ శ్రీ రమణమహర్షి

20-05-2002

చేయలేరు. అందుచేత ఆ మొదటిపొర దగ్గరే బహుజాగ్రత్తగా ఉండండి.

అహంభావన ఉంటే పుణ్యం ఉంది, పాపం ఉంది, నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, స్వర్గలోకం ఉంది, నరకలోకం ఉంది అన్నీ ఉన్నాయి. అది లేకపోతే ఏదీలేదు, చివరకు నువ్వు మిగులుతావు, అంటే చైతన్యం మిగులుతుంది. మిధ్యానేను అనే ఒంటి స్తంభం మీదే మొత్తం సృష్టి అంతా ఆధారపడి ఉంది. ఒక్కసారి దానిని డౌట్ చెయ్యి, దానిని షేక్ చెయ్యి, దానిని కొద్దిగా విచారణ చెయ్యి అప్పుడు దాని పునాదులు అన్నీ కదలి జ్ఞానం అనే అణుబాంబు వలన మొత్తం ఈ మనస్సు, అది కల్పించిన లోకాలు అన్నీ భస్మమై పోతాయి. ఏ విషయంలోను అహంభావన పెట్టుకోవద్దు. వారికి ఈ సహాయం చేసాను, వీరికి ఆ సహాయం చేసాను అనుకోవద్దు. నీకు ఇచ్చింది ఎవరు? దేవుడే ఇచ్చాడు. పుచ్చుకొనేది కూడా దేవుడే అనే అఖండభావన కలిగి ఉండు. నీకు పొలాలు ఉన్నా, స్థలాలు ఉన్నా వాటికి ధర్మకర్తగా ఉండు. అంతేగాని యజమానిగా ఉండవద్దు. యజమానిగా ఉంటే అహంభావన పెరిగిపోతుంది. ఉన్నది భగవంతుడు ఒక్కడే. నేను, నాది అనేవి అసలు లేనేలేవు. అవి లేవు అని తెలుసుకోవటమే జ్ఞానం. ఉన్నది ఉన్నట్లు నీకు తెలిసేవరకూ లేనిది ఉన్నట్లుగా నీకు గోచరిస్తుంది. స్వస్వరూప అనుసంధానమే నిజమైన భక్తి. నువ్వు ఎవరిగా ఉన్నావో దానిని స్మరించుకోవటమే నిజమైన భక్తి. నిజమైన దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. హృదయంలో ఉన్న దేవుడిని వదిలేసి ఎక్కడో దేవుడు ఉన్నాడు అంటే అది వ్యవహారికసత్యము మాత్రమే. నీ మూలం ఎక్కడో ఉంది అనుకోవద్దు. నీ మూలం నీ లోపలే ఉంది. నీవు లోపలకు వెళ్ళలేకపోతున్నావు. నీకు అంతర్ దృష్టి రావటంలేదు, అంతర్మదనం రావటంలేదు. నాకు లోచూపు ఎందుకు రావటం లేదు అనే ఘర్షణ నీకు లోపల రావటం లేదు. అందుచేత నీ మూలాన్ని అన్వేషించి, అక్కడకు చేరి అక్కడ ఉండగలిగితే మిధ్యానేను నశించి నీవు ఆత్మాకారం చెందుతావు, మనం ఏదో ఏదో అనుకొంటున్నాము. మనం చేసే ప్రయత్నం, మన తెలివి ఎంత? మనం జీరోలము. మనం ఎంత ప్రయత్నం చేసినా భగవంతుని దయలేకుండా ఆయనను మనం పొందలేము.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నేను ఏదో చెపుతున్నాను, మీరు వింటున్నారు. అహంభావనను తొలగించుకోవటం నేను చెప్పినంత సులభం కాదు, మీరు విన్నంత సులభం కాదు. పరమేశ్వరుడు ఎవరిపట్ల అయితే ఆయన దయను చూపిస్తాడో వాడి మనస్సు మాత్రమే అంతర్ముఖమయ్యి, హృదయంలో లయమవుతుంది. అప్పుడు వాడు జనన మరణ చక్రం నుండి విడుదలపొందుతాడు. భగవంతుని దయలేకుండా నీకు అహంభావరహితస్థితి కలుగనే కలుగదు. నేను ఏదో అక్కడ నుయ్యి తవ్వించాను, సత్రం కట్టించాను, గుడి కట్టించాను

అంటే ఆ మాటలకు ఈశ్వరుడు మోసపోడు. అవి అన్నీ ఎందుకు చేసావో నీలోపలఉన్న నారాయణుడు చూస్తూ ఉంటాడు. మీకు ఏమైనా చెడుతలంపులు వస్తూ ఉంటే అవి నాకు తెలియకపోయినా మీకు తెలుస్తున్నాయి కదా. ఆ తలంపులు అన్నీ ఏ వెలుగులో మీకు తెలుస్తున్నాయి? ఆత్మ వెలుగులో మీకు తెలుస్తున్నాయి. మీ తలంపులు మీకే తెలిసినప్పడు మీకు ఆధారంగా ఉన్న ఈశ్వరుడికి ఎలా తెలియకుండా ఉంటాయి. నీలో ఉన్న దేవుడిని వదిలేసి, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని ఎన్ని జన్మలు ఇలా తిరుగుతావు? నీ మూలం నీలోపలే ఉంది కాని ఎక్కడో ఉంది అని భ్రాంతి పడుతున్నావు. ఎంతకాలం ఇలా భ్రాంతి పడుతూ ఈ ప్రవాహంలో కొట్టుకొనిపోతావు. ఈశ్వరుడే స్వయంగా నిన్ను అనుగ్రహించాలి అనుకొన్నప్పడు నీకు ఏది అడ్డు వస్తుంది. ఆయన అనుగ్రహం వలన అన్నీ సాధ్యమే. దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని వచ్చేకోరిక, స్వార్ధంలో నుండి వచ్చే కోరిక ఉండకూడదు. జ్ఞానికూడా పని చేస్తాడు కాని అక్కడ స్వార్థం ఉండదు. భగవంతుని చేతిలో పనిముట్టుగా ఉన్నావు అనుకో ఆ పని భగవంతుడే చేసుకొనిపోతాడు.

అన్ని భోగాలు నీ ఇంద్రియాలకు అందుతూ ఉండాలి కాని ఏ ఇంద్రియానికి వికారం రాకూడదు వాడు స్థితప్రజ్ఞుడు. మీకు ఎంత ధనం ఉన్నా మీరు ఎవరికైనా సహాయం చేసేటప్పుడు వారి మీద ప్రేమ లేకపోతే మీరు చేసిన సహాయం వాస్తవంగా వారికి ఉపయోగపడదు. ఎదుటివారి మీద ప్రేమలేనప్పుడు మీకు ఎంత ధనం ఉన్నా ప్రయోజనం లేదు. ఇది ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు. స్వార్థం కేంద్రంగా వచ్చింది కోరిక అవుతుందిగాని ఈశ్వరప్రేరణ వలన చేసిన పని అది నీకు కోరికలా కనిపించినా కోరికకాదు. గాంధీగారు దేశంకోసం సేవచేసారు. అది ఏదో కోరికతో చేయటంకాదు, సేవ సేవకోసమే చేసారు. నేను మీకు ఏమి చేయగలను, ఏమీ చేయలేను. కాని దేశ స్వరాజ్యానికి మీరు చేస్తున్న ప్రయత్నంలో అవసరమైతే నా దేహాన్ని, నా ప్రాణాన్ని ఇచ్చేస్తాను అన్నారు గాంధీగారు. నీలో ఏదో ఉంది అనుకొంటున్నావు. I am something అనుకొంటున్నావు. I am nothing అని నీకు తెలిసినప్పడు ఆయన something అని తెలుస్తుంది. ఉన్నది ఆయన ఒక్కడే అని తెలుస్తుంది. అప్పడు ఆయన అనుగ్రహం నీ మీద వర్షిస్తుంది, నీవు మోక్ష సామ్రాజ్యానికి అధిపతివి అవుతావు. అంతా దేవుడే నేను సున్న అని పూర్తిగా ఆయన మీద ఆధారపడినప్పడు, నిన్ను చేరుకోవటానికి నీవు తప్ప వేరే మార్గం లేదు అనుకొన్నప్పడు నెమ్మదిగా అహంభావనను పట్టించుకోవటం మానివేస్తావు, దానిని స్మరించటం మానివేస్తావు అప్పడు అది వాడిపోయి నీకు తెలియకుండానే రాలిపోతుంది.

20-05-2002

3A

నీకు ఏ మార్గం ఇష్టమైతే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి. నీవు అసహజంగా ఉండవద్దు, సహజంగా ఉండు. సహజంగా ఉంటే నీ హృదయంలో సహజంగా ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. కృత్రిమంగా మాట్లాడవద్దు, సహజంగా మాట్లాడు. నీచూపు సహజంగా ఉండాలి, నీ మాట సహజంగా ఉండాలి, దైనందిన జీవితంలో నీ ప్రవర్తన సహజంగా ఉండాలి. అప్పడు సహజంగా ఉన్న వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అన్నింటికంటే సహజయోగం మంచిది. మనం సహజంగా జీవిస్తూ ఉంటే సహజయోగంలో ఉన్నట్లే. మీరు ఏమార్గంలో ప్రయాణం చేసినా మిధ్యానేను నుండి విడుదల పొందాలి. సహజయోగంలో ఉన్నవాడు వాడికి తెలియకుండానే మిధ్యానేనులోనుండి విడుదల పొందుతాడు.

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-04-2002, పాలకోడేరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు శ్రీరామనవమి. శ్రీరామనవమి అంటే శ్రీరాముడు శరీరం ధరించిన రోజు. హిందువులలో శివనామం, దేవీనామం కంటే రామనామం ఎక్కువమంది చేస్తారు. రామనామం చేసి అనేక మంది ఋషులు అయ్యారు, యోగులు అయ్యారు, మహాత్ములు అయ్యారు. గాంధీగారు నిరంతరం రామనామం జపించేవారు, చివరకు ప్రాణప్రయాణ సమయంలో కూడా రామనామం జపిస్తూనే ప్రాణం విడిచిపెట్టారు. రాముడు భగవంతుడిలాగ ప్రవర్తించలేదు. మానవుడిలా ప్రవర్తిస్తూ, మానవుడు ఎన్ని బాధలు పడతాడో, మనకోసం ఆబాధలు అన్నీ పడి చూపించాడు, అది రామావతారంలో ఉన్న విశిష్టత. మనమాటలో, మన మనస్సులో దోషాలు ఉంటే నిరంతరం రామనామం జపించటం వలన మాటలో ఉన్న దోషం, మనస్సులో ఉన్న దోషం రెండూపోతాయి. రామనామం జపించటం వలన దోషపూరితమైన తలంపులు రావు. రామనామం జపించటం వలన మనో నిగ్రహం కలుగుతుంది, రామనామం అంత పవిత్రమైనది. మనం పని అయితే ఒకలాగ, పని అవ్వకపోతే ఒకలాగ ఉంటాము. కాని పరిస్థితులు ఎలాగ ఉన్నా విభీషణుడు ఒకేలాగ ఉన్నాడు. ఆయనది దీర్ఘ శరణాగతి. శరణాగతి మనస్సును తీసుకొనివెళ్ళి బ్రహ్మంలో ఐక్యం చేస్తుంది. రావణాసురుడిని సంహరించి లంకారాజ్యం నీకు ఇస్తాను అని రాముడు విభీషణుడితో అంటాడు. అప్పడు విభీషణుడు రాజ్యం కావాలని అనలేదు, వద్దు అనలేదు మౌనంగా ఉన్నాడు. రావణాసురుడి మరణానంతరం నీవే లంకారాజ్యానికి అధిపతివి అని చెప్పినప్పడు నాకు రాజ్యం వద్దు అన్నాడు విభీషణుడు.

**రమణ భాస్కర**

రామా! నీ పాదాలు దొరికాక, ఇంతకాలం నీతో సహవాసం చేసాక నాకు రాజ్యం మీద కాంక్ష పోయింది అంటాడు విభీషణుడు. నిన్ను స్మరించుకోవటం వలన వచ్చే ఆనందం ముందు ఈ పదవి ఎంత అని విభీషణుడు అన్నాడు. మానవుడికి మానసిక స్థిమ్మితం ముఖ్యం, రామనామం జపించటం వలన మానసిక స్థిమ్మితం వస్తుంది.

మనతోపాటు కాలం కూడా నడుస్తూ ఉంటుంది. కాలప్రవాహంలో ఇటువంటి శరీరాలు అనేకం రావటం, పోవటం అయిపోయింది. ఇప్పుడు ఈ శరీరం ఉంది, ఇదే నిజం అనుకొంటున్నాము, కొంతకాలానికి, ఇది పోతుంది కొత్త శరీరం వస్తుంది. అప్పుడు అది నిజం అనుకొంటాము. కాని ఇవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోయేవే. ధనం, అధికారం, విద్య, ఈ దేహాలు ఇవి అన్నీ కాల ప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. భగవంతుడు ఒకో ఉపాధికి ఒకో పని ఇస్తాడు. అది సరిగా చేస్తున్నాడా, లేదా అని చూస్తాడు. భగవంతుడు నీకు ఇచ్చిన పనిని శ్రద్ధగా చేస్తే ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. సమాజంలో ఎప్పుడూ మంచి, చెడు ఉంటాయి. లింకన్ ఏమి చెప్పాడు అంటే నన్ను అనేకమంది పొగిడేవారు, అలాగే అనేకమంది విమర్శించేవారు. నన్ను ఎవరైనా పొగిడినా పట్టించుకోలేదు, విమర్శించినా పట్టించుకోలేదు. నేను చేసే పనిలో perfection సంపాదించాలి అని అదే దృష్టిలో ఉన్నానుగాని నా మనస్సు విమర్శల జోలికి, పొగడ్తలజోలికి వెళ్ళలేదు. వాటి మీద నాకు దృష్టిలేదు, పనిమీద నా దృష్టి అంతా పెట్టాను. పనిమీద దృష్టిలేనివాడికి ఈ గొడవలు గాని నాకు ఎందుకు అన్నాడు. భగవంతుడు అందరి హృదయాలలో సమానంగా ఉన్నాడు కదా. భగవంతుడు ఉన్నాడు అని చెప్పేవారి హృదయంలో ఉన్నాడు, భగవంతుడు లేడు అని చెప్పేవారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. మరి వీరు భక్తులు, వీరు భక్తులు కాదు అని ఎందుకు విడదీస్తున్నారు అని అడుగుతున్నాడు. భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు. ఎవడైతే తన వాక్కును, తన మనస్సును హృదయంలో ఉన్న భగవంతుడికి సమర్పిస్తున్నాడో వారిని భక్తులు అంటారు గాని భగవంతుడు లేడు అని చెప్పేవారి హృదయంలో భగవంతుడు లేడు అని అనటం లేదు. కొంతమంది మాటలో మలం ఉంటుంది. వారి మాటలు అంత భయంకరంగా ఉంటాయి. రామనామం చేయటం వలన ఈదోషాలుపోతాయి. మనకు ఒకతల ఉంది, దానిలో మెదడు ఉంది, దానికి ఆలోచనశక్తి ఉంది అని మనం మర్చిపోతున్నాము అందువలన ప్రమాదంలో పడుతున్నాము. మనం పెద్దపనులు చేయలేకపోయినా చేసే చిన్న పనులు అయిన శ్రద్ధగా చేయాలి. కటికచీకటిలో ఉన్నప్పుడు వెలుగులోనికి రావటానికి చిన్న దీపం సరిపోతుంది. అలాగే మీరు చేసే చిన్న పనులు శ్రద్ధగా చేస్తే మీరు కష్టాలనుండి





బయటకు వస్తారు. ఏదో శాస్త్రాలు చదవటంకాదు. నీవు చనిపోయేలోపు ప్రాక్టికల్‌గా ఒక్కరికైనా ఉపయోగపడు. దానివలన ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. దేహప్రారబ్ధంలో వచ్చే సంఘటనలద్వారా నీవు పాఠాలు నేర్చుకోవాలి. భోగ ప్రవృత్తి ఉన్నవాడికి పునర్జన్మ వస్తుంది, భోగ ప్రవృత్తి లేనివాడికి పునర్జన్మ కావాలి అన్నా రాదు.

మీరు కథలు చెప్పరు, ఆత్మ గురించి తప్ప ఇంకోమాట చెప్పరు, మీరు ఆ సీటులో నుండి కిందకు దిగరు, రాజీ పడరు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్

**శాంతి మన సహజప్రకృతి, క్రొత్తగా సంపాదించుకోవలసిన పనిలేదు. మనస్సును నిశ్చల మొనరిస్తే శాంతి దానంతటదే చేకూరుతుంది. గీతాపద్ధతియైన అభ్యాస వైరాగ్యాలొక్కటే దానికి ఉపాయం. వైరాగ్యం భావవిక్షేపాలను తొలగించడానికి తోడ్పడగా, అభ్యాసం ఒకే భావంపై మనస్సు నేకాగ్రంచేసి శాంతి సంధాయకమవుతుంది.**

- భగవాన్ శ్రీ రమణమహర్షి

నెమ్మదిగా నవ్వి సరళంగా, సూటిగా ఉన్నదానిని ఎవరు ఇష్టపడరు ఏమిటి? ఉన్నది ఉన్నట్లు చెపుతున్నాను. సహజంగా ఉన్నదానిని, సూటిగా ఉన్నదానిని ఎవరు గ్రహించటం లేదు ఏమిటి? లోపలఉన్న సత్యం సహజంగా ఉంది, మన మెదడు గందరగోళంగా ఉంది. అందువలన అది మనకు అందటం లేదు. కలలో విషయాలు ఆకర్షిస్తున్నాయి అంటే నీవు మేల్కోలేదని అర్థం. అలాగే లోకంలో విషయాలు నిన్ను ఆకర్షిస్తున్నాయి అంటే నీవు హృదయంలో ఉన్న నిజం దగ్గరకు మేల్కోలేదని గుర్తు. నీ హృదయంలో సత్యం ఉంది. అది నిజం అని చెప్పటం కాదు, అది ఒక్కటే నిజం అంటున్నారు భగవాన్. గాఢనిద్రలో మనస్సు లేనప్పుడు ఒక వస్తువు ఉంది. దానిని గాఢనిద్రలో రోజూ నీవు అనుభవిస్తున్నావు, కాని అది లేదు అంటున్నావు, మనస్సు కల్పించే విషయాలు ఉన్నాయి అంటున్నావు. ఇది ఎంత ఆశ్చర్యం. హృదయంలో నుండి వచ్చే శాంతి, సుఖం నిజం. అవి నీకు అపకారం చేయవు ఎందుచేతనంటే అవి స్వతంత్రమైనవి. బాహ్యావస్తువులమీద ఆధారపడి వచ్చే సుఖాలు అన్నీ కూడా భవిష్యత్‌లో రెట్టింపు దుఃఖమును తీసుకొని వస్తాయి. అవి అస్వతంత్రమైనవి, వాటితో ఎప్పటికైనా నీకు ప్రమాదమే. ఉద్ధవుడితో కృష్ణుడు చెపుతాడు ముందు నీవు నా మీద విశ్వాసం పెంచుకో. విశ్వాసం లేకపోతే భక్తి ఎలా కలుగుతుంది. అందువలన ముందు విశ్వాసం పెంచుకో, తరువాత భక్తి వస్తుంది. ఏ వస్తువు అయితే అంతా కల్పిస్తోందో ఆ మనస్సు భక్తిద్వారా నిగ్రహించబడుతుంది. అందువలన నా మీద విశ్వాసం పెంచుకో. నన్ను మహావిష్ణువుగా గుర్తించు, ఏదో దారిన పోయేవాడు అనుకోవద్దు, మహావిష్ణువే కాళ్ళు చేతులు తొడుక్కొనివచ్చాడు. అది గుర్తించి నా మీద విశ్వాసం పెంచుకో అని పరమాత్మ ఉద్ధవుడితో చెప్పాడు. మరణ సమయంలో మనం ఏధ్యాసతో మరణిస్తామో ఆ ధ్యాసతోనే మనకు పునర్జన్మ వస్తుంది. అందుచేతనే మరణసమయంలో నన్ను స్మరించుకోండి, నా స్వరూపమును ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. కాని ప్రాణప్రయాణ సమయంలో అనుకొన్నది రాదు, ఉన్నదే వస్తుంది. దానిని బట్టి పునర్జన్మ నిర్ణయించబడుతుంది. అయితే ఈ జన్మలాగే వచ్చే జన్మకూడా తలంపే. తలంపులులేని స్థితి నిజమైన స్థితి. దానిని తెలుసుకోవాలనే కాంక్ష మీకు లేదు, కనీసం చెపితే అయినా దాని గురించి వినాలికదా అంటున్నారు భగవాన్. పూర్వజన్మలో ఎంతోకొంత నిష్కామకర్మ చేస్తేగాని మంచి చెప్పినా నీకు వినాలని ఉండదు.

మనకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా దేహప్రారబ్దం ప్రకారం దేహం ద్వారా పనులు జరిగిపోతూ ఉంటాయి అని చెపుతున్నారు కదా ఇంక సాధన ఎందుకు అని అడుగుతున్నారు దేహప్రారబ్దం ప్రకారం పనులు జరిగిపోతాయి. కర్మ ఎవరికి అంటే అహంభావనకు. అహంభావన దేహంతో తాదాప్యం పొందుతుంది కాబట్టి నేను చేస్తున్నాను అంటుంది. దేహంతో తాదాప్యం వదిలేసే స్వేచ్ఛ నీకు ఉంది. దేహంతో తాదాప్యం పొందకుండా ఉండటానికే సాధన. దేహంతో తాదాప్యం వదిలేస్తే కర్మ నిన్ను ఏమీ చేయదు. లోపలఉన్న చైతన్యానికి నేను అనే తలంపు లేదు. అందుచేత దానికి కర్తృత్వం లేదు. పని దేహం, ఇంద్రియాలు చేస్తున్నాయి, చైతన్యం ఏమీ చేయదు. వీటికి ఆధారంగా ఉంటుంది. దేహంతో, ఇంద్రియాలతో తాదాప్యం వదిలేసి నీలోపలఉన్న చైతన్యంతో తాదాప్యం పొందావు అనుకో నేను కర్మ అనుభవిస్తున్నాను అనే తలంపు కూడా నీకు రాదు. శరీరం ఎందుకు వచ్చిందో ఆపని శరీరం ద్వారా జరిగిపోతుంది, తరువాత శరీరం పోతుంది. దేహంతో తాదాప్యం వదిలేసి, లోపలఉన్న చైతన్యంతో తాదాప్యం పొందటానికే సాధన. చైతన్యంతో తాదాప్యం పొందు అప్పడు ఇంక కర్మ ఎవరికి? ఏదీలేదు. ఉన్నది ఒక్కటే, అది నీవై కూర్చొంటావు. మీకు అనుకూలంగా కొన్నిమాటలు మతాలు చెపుతాయి. మీ మనస్సును లోపలకు మళ్ళించటానికి, చైతన్యం దగ్గరకు పంపటానికి మతాలు మీకు అనుకూలమైన మాటలు చెపుతాయి. ప్రారంభంలో మీ మనస్సు ప్రిపేర్ అవ్వలేదు కాబట్టి మనస్సును నెమ్మదిగా ప్రిపేర్ చేయటానికి కొన్న అవసరం లేని మాటలు కూడా మతాలు చెపుతాయి, గాథలు చెపుతూ ఉంటారు. కాని చివరకు హృదయంలో ఉన్న సద్వస్తువు దగ్గరకు నీ మనస్సును తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చేస్తారు. నీవు మతాలు మార్చుకొన్నా, ఎన్ని సాధనలు చేసిన, ఎక్కడికి తిరిగినా చివరకు నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు దగ్గరకు రావలసిందే. అక్కడికి చేరే వరకు నిజమైనశాంతి నీకు దొరకదు. అందుచేత హృదయంలోనికి చేరటానికి సాధన ప్రారంభించు. మిగిలిన గొడవలు వద్దు. రేపు రేపు అనుకోవద్దు, రాబోయే జన్మలో సాధన చేద్దాము అనుకోవద్దు. ఇప్పడే, ఇక్కడే సాధన ప్రారంభించు. నీవు ఏదిగా ఉన్నావో అదిగా ఉండు. అప్పడు సందేహ రహితుడవు, పునర్జన్మ రహితుడవు అవుతావు. నీవు ఎన్ని గంతులు వేసినా ఆత్మానుభవం పొందటంకోసం నీ మనస్సును హృదయంలోనికి ఉపసంహరించవలసిందే. నీ హృదయంలో ఉన్న సత్యం వైపుకు నీ మొఖం త్రిప్పటానికే ఈ బోధ అంతా. నీ లోపలఉన్న వస్తువును తెలుసుకోవటానికి పెద్ద శ్రమపడనక్కరలేదు. ఉపయోగంలేని భావాలు, వ్యర్థమైన తలంపులు వస్తున్నాయి అనుకో వాటిని విడిచిపెట్టు. నీలో ఉన్న ఉపయోగంలేని సంస్కారములను విడిచిపెట్టటానికే సాధన అవసరం. పైకి వెళ్ళటం తేలిక, లోపలకు హృదయంలోనికి ఒక్క అంగుళం దిగటం చాలా కష్టం. దానికి ఎంతో వైరాగ్యం కావాలి. ఆ వైరాగ్యం తీసుకొని రావటమే ఈ బోధయొక్క ప్రయోజనం.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 23-5-2002 | గురువారం | నార్నిమెరక మట్లపాలెం దగ్గర (కోదండరామ దేవాలయం) |
| 27-5-2002 | సోమవారం | పాలకోడేరు సాయిబాబా మందిరం, హైస్కూలు వద్ద |
| 04-6-2002 | మంగళవారం | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| 6 నుండి 18-6-02 వరకు | | హైదరాబాదు క్యాంపు |
| 10-6-2002 | సోమవారం | సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటి హాలు, మధురానగర్ |
| 16-6-2002 | ఆదివారం | రమణ కేంద్రం, హైదరాబాదు నల్లకుంట శివం టెంపుల్ దగ్గర |
| 19-6-2002 | బుధవారం | రామరాజుగారి ఇంటి వద్ద, వెంకటాపురం |

## విశాఖలో జరిగిన శ్రీ నాన్నగారి కార్యక్రమములు

విశాఖపట్టణం 1టౌన్ ఏరియాలో గల శ్రీ గీతాప్రచారసమితివారి శ్రీ గీతా భవనాన్ని సద్గురు శ్రీ నాన్నగారు దిగి 5-5-2002 ఆదివారం రోజున దర్శించినారు. సమితి అధ్యక్షులు శ్రీ యెండూరి కృష్ణమూర్తి శ్రీ నాన్నగార్కి స్వాగతం పలికినారు. సమితి ఉపద్రష్ట ఆచార్య అప్పల్ల సోమేశ్వర శర్మగారు శ్రీ నాన్నగార్కి "ఆధ్యాత్మిక ప్రవచన శిరోమణి" అనే బిరుదును ప్రదానము చేసారు. అటు పిమ్మట, గీతా వైభవము గురించి శ్రీ నాన్నగారు ప్రవచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మనోవికాస శిక్షణా శిబిరంలో పాల్గొన్న బాలబాలికలకు శ్రీ నాన్నగారు, శ్రీ సోమేశ్వర శర్మగారు బహుమతి ప్రదానం చేసారు.

దిగి 10-05-2002 శుక్రవారం విశాఖపట్టణం బీచ్‌రోడ్డులో గల శ్రీ శాంతి ఆశ్రమములో జరుగుచున్న వ్యక్తి వికాస శిక్షణా కార్యక్రమములో సద్గురు శ్రీ నాన్నగారు పాల్గొన్నారు. ఆశ్రమ కార్యదర్శి శ్రీ ఆంజనేయులుగారు శ్రీ నాన్నగార్కి స్వాగతం పలికినారు. తదుపరి శ్రీ నాన్నగారు వ్యక్తి వికాసమును గురించి ప్రవచనం చేసారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వరానంద స్వామి తదితరులు, ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.



పల్లకి సేవ దృశ్యమాలిక





సద్గురు శ్రీ నాన్నగారికి పాదపూజ చేస్తున్న శ్రీ పెన్మెత్స మంగపతిరాజు దంపతులు



# విశాఖపట్టణంలో శ్రీ నాన్నగారికి పల్లకిసేవ

ది॥ 10-05-2002 ఉదయం బీచ్ రోడ్డులో నున్న శ్రీ కాళికామాత, శ్రీ చంద్రమౌళీశ్వరుల దేవాలయాలను సద్గురు శ్రీ నాన్నగారు దర్శించారు. అనంతరం శ్రీ మంగపతిరాజు దంపతులు శ్రీ నాన్నగారికి పుష్పాభిషేక సహితంగా పూజ గావించారు. తరువాత శ్రీ నాన్నగార్కి పూల కిరీటధారణచేసి, పుష్పములతో అందముగా అలంకరించబడిన పల్లకిలో ఆసీనులుజేసారు. అనేకమంది భక్తులు శ్రీ నాన్నగారిని పల్లకిసేవతో ఆరాధించారు. శ్రీ మంగపతిరాజుగారి ఇంటివరకు యాత్ర జరిగింది.





పల్లకి సేవ దృశ్యమాలిక

